137.76 కోట్ల పనులకు ప్రధాని శ్రీకారం

హైదరాబాద్, మార్చి 7(నమస్తే తెలంగాణ): తెలంగాణలో స్వదేశీ దర్శన్ 2.0, ప్రసాద్ పథకంలో భాగంగా రూ.137.76 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ గురువారం శ్రీనగర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. హైదరాబాద్ బల్కంపేటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి జూపల్లి బల్కంపేట ఎలమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధి పనుల వివరాలు

- ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లతో హైదరాబాద్ బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మించిన అన్నదాన భవనం, తాగునీటి సదుపాయం, కెఫేటేరియా, టికెట్ కౌంటర్, తదితర అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం.
- ప్రసాద్ పథకంలో రూ.38.90 కోట్లతో గద్వాల జిల్లా అలంపూర్‌లోని జోగులాంబ దేవి ఆలయంలో ప్రసాద్ స్కీంలో భాగంగా నిర్మించిన సాంస్కృతిక భవనం, అన్నదాన సత్రం ప్రారంభం.
- యాదాద్రి-భువనగిరి జిల్లాలోని భువనగిరి కోటను స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.56.81 కోట్ల (ప్యాకేజీ-1)తో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరిత వనాల అభివృద్ధికి, కోట పైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మించనున్నారు.
- స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.38 కోట్ల (ప్యాకేజీ-1)తో వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ ప్రాంతాన్ని ఎకో టూరిజంగా అభివృద్ధి చేసే పనులకు శంకుస్థాపన.

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు వద్దు

- **అభ్యర్థుల ధర్నాలో ఎంపీ ఆర్ కృష్ణయ్య**

కవాడిగూడ, మార్చి 7: గురుకులాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు ఏర్పడకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రిబ్ వెలువరించిన అన్ని నోటిఫికేషన్లలోని పోస్టులను నుంచి పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు భర్తీ చేసి, అభ్యర్థులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టులు లేకుండా 9,210 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని గురువారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద గురుకుల అభ్యర్థులు నిర్వహించిన ధర్నాలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఆయనీ వ్యాఖ్యలు చేశారు. ధర్నాలో ఓయూ జేఏసీ నేత ఎల్చల దత్తాత్రి, గురుకుల టీచర్స్ అభ్యర్థులు సైదులు, ఏ రాజు, జయశంకర్, సత్యనారాయణ, కాంతారావు, ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో త్వరలో స్కిల్ వర్సిటీ ఏర్పాటు: దుద్దిళ్ల

హైదరాబాద్, మార్చి 7,(నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వం త్వరలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. తెలంగాణ విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి, పరిశ్రమల శాఖ సంయుక్తాధ్వర్యంలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 'తెలంగాణలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల కల్పన, విద్యార్థుల అభివృద్ధి' అన్న అంశంపై గురువారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. డిగ్రీ స్థాయిలోనే విద్యార్థులు ప్రముఖ పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ పొందేలా చొరవ చూపాలని, తద్వారా పరిశ్రమలతో అనుసంధానం ఏర్పడి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. అనంతరం ఉన్నత విద్యామండలి రూపొందించిన రాష్ట్ర విద్యాభివృద్ధి గణాంకాల నివేదికను, డైరీని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వర్సిటీల వీసీలు రవీందర్, గోపాల్‌రెడ్డి, పరిశ్రమల అధినేతలు బీవీ మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీని రాజు, మమత, ఫిక్కి ప్రతినిధిగా రాజీవ్ జూలకంటి, రిటైల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి సమీర్ నర్సాపూర్ పాల్గొన్నారు.

కేకే మహేందర్‌రెడ్డిపై పద్మశాలీల ఫిర్యాదు

తెలంగాణ చౌక్, మార్చి 7: తమను కించపరిచేలా మాట్లాడిన కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పద్మశాలీ సంఘం బాధ్యులు గురువారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడంతో నేతకార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దిక్కుతోచని స్థితిలో పాపడాలు అమ్ముకుంటున్న నేత కార్మికుడిని ఉద్దేశించి కేకే అవమానించేలా మాట్లాడటం బాధాకరమని అన్నారు. కేకేపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డెట్రాయిట్‌లో 'లేడీస్ నైట్'

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్లోబల్ తెలంగాణ సంఘం (జీటీఏ) డెట్రాయిట్ మహిళా విభాగం ఆధ్వర్యంలో 'లేడీస్ నైట్' పేరుతో గురువారం వేడుకలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. ఫార్మింగ్టన్ మేనర్‌లో జరిగిన ఈ వేడుకలకు వివిధ వృత్తుల్లో ఉన్న సుమారు 350 మంది భారతీయ మహిళలు హాజరయ్యారు. భారతీయ సంతతికి చెందిన జిల్లా జడ్జి, జస్టిస్ షాలినా కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నిర్వాహకులు ఈ సందర్భంగా ఫ్యాషన్ షో ఏర్పాటుచేశారు. భారతీయ వంటకాలు అతిథులను ఆకర్షించాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుష్మ పడుకోనే, స్వప్న చింతపల్లి, సుమ కల్వల, దీప్తి వెనుకదాసుల, దీప్తి లచ్చిరెడ్డిగారి, హర్షిణి బీరపు, అర్పిత భూమిరెడ్డి, కళ్యాణి ఆత్మకూరు, శిరీషారెడ్డి, డాక్టర్ అమిత కాకులవరం, ప్రొఫెసర్ పద్మజ నందిగామ, శ్రీకాంత్ సందుగు, సాహిత్య వింజమూరి పాల్గొన్నారు.

త్వరలో రోడ్ల నిర్వహణకు వ్యూహాత్మక ప్రణాళిక

- **మరమ్మతులకు రూ.120 కోట్లు విడుదల**

హైదరాబాద్, మార్చి 7(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రోడ్ల నిర్వహణకు వ్యూహాత్మక ప్రణాళికను రూపొందిస్తున్నట్టు అధికారులు చెప్పారు. వర్షాకాలంలో రోడ్లు కొట్టుకుపోవడం, దెబ్బతినడం వంటి సమస్యలను త్వరిత గతిన పరిష్కరించడానికి ఈ ప్రణాళిక దోహదపడుతుందని తెలిపారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లకు నిధులు కేటాయించినా త్వరితగతిన పనులు చేపట్టడం లేదని గుర్తుచేశారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు మాన్యువల్ మెయింటెనెన్స్ పద్ధతిలో రోడ్లను ఏజెన్సీలకు అప్పగించాలని యోచిస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో మాన్యువల్ మెయింటెనెన్స్ విధానం అమలవుతున్నదని, ఇది సత్ఫలితాలనిస్తున్నదని పేర్కొన్నారు. దీన్ని రాష్ట్రమంతటా అమలు చేయడానికి కృషి చేస్తున్నట్టు అధికారులు వివరించారు. మరోవైపు రాష్ట్రంలోని రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి దారులను సరిచేయడానికి ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేసింది.

'76 వేల ధరణి దరఖాస్తుల పరిష్కారం': పొంగులేటి

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): ఈ నెల ఒకటిన ప్రారంభమైన ధరణి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ నెల 7 వరకు 76,382 పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించినట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజుకు సగటున 15 వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని, మొత్తంగా 2,46,536 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

సెలవు దినాల్లో స్పెషల్ డ్రైవ్ సరికాదు

- **పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్**

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): పండుగలు, సెలవు దినాల్లో పనిచేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడం సరికాదని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నెల 7 నుంచి 15 వరకు మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్న అధికారుల ఆదేశాలను పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ తప్పుపడుతున్నది. ఉన్నతాధికారుల నిర్ణయంతో హిందువులకు పవిత్రమైన మహాశివరాత్రి రోజు కూడా పనిచేయాల్సి వస్తున్నదని వాపోయింది. దైవ దర్శనాలకు వెళ్లేవారికి, ఉపవాసాలు చేసేవారికి ఆటంకం కలుగుతుందని తెలిపింది. ఈ మూడు రోజుల్లో కాకుండా తర్వాతి పనిదినాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

మాజీ జర్నలిస్టు సంయుక్తకు ఆరు నెలల జైలు

నాంపల్లి కోర్టులు, మార్చి 7 (నమస్తే తెలంగాణ): టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రిక మాజీ జర్నలిస్టు సంయుక్తకు ఆరునెలల జైలుశిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జీ తీర్పు వెలువరించారు. ఆర్ట్స్ అలియాస్ తెలంగాణ అనే కల్చరల్ సంస్థ ఆమెపై 2015లో పరువునష్టం దావా దాఖలు చేసింది. సంస్థపై తప్పుడు సమాచారాన్ని అందించి, సంస్థ పట్ల నిందారోపణలు ప్రచురించేవిధంగా వార్తాకథనాన్ని రాసినట్టు దావాలో పేర్కొన్నారు. ఎనిమిదేండ్లపాటు సుదీర్ఘ విచారణ చేపట్టిన కోర్టు గురువారం తీర్పు వెలువరించింది.

బాలుడిపై లైంగిక దాడి.. 20 ఏండ్ల జైలు

నాంపల్లి కోర్టులు, మార్చి 7 (నమస్తే తెలంగాణ): డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలుడిపై జరిగిన లైంగిక దాడి కేసులో 51 ఏండ్ల నేరస్థుడు కమల్ ఘోష్‌కు 20 ఏండ్ల జైలుశిక్షతోపాటు రూ.9 వేల జరిమానా విధిస్తూ 12వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి టీ అనిత సంచలన తీర్పు వెల్లడించారు.

నిర్మాణ రంగం కుదేల్

- **ప్రభుత్వం మారగానే నిలిచిన బడా నిర్మాణ అనుమతులు**
- **వారానికి జరిగే ఎంఎస్‌బీ కమిటీల భేటీలకూ స్వస్తి**
- **రియల్ వర్గాల వెన్నులో 'బెంగళూరు ట్యాక్స్' వణుకు**
- **వేసవి ముగిస్తే ఐదారు నెలలు నిర్మాణాలు కష్టమే**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో నిర్మాణ రంగం కుదేలైంది. కీలకమైన బహుళ అంతస్థుల నిర్మాణ అనుమతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంతో నిర్మాణరంగం ఒక్కసారిగా డీలా పడింది. గత మూడు నెలలుగా బడా నిర్మాణాలకు సంబంధించిన ఫైళ్లన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో సాధారణ గృహాలకు సంబంధించిన అనుమతులు ఇస్తున్నప్పటికీ సుమారు పది, ఆపై అంతస్థులు ఉన్న నిర్మాణాల అనుమతులేవీ ముందుకు కదలడం లేదు. ఒక్కో ఫైల్‌పై కనిష్ఠంగా రూ.20 కోట్ల మేర చార్జీలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వాటిని ముట్టుకోకపోవడంపై రియల్‌ఎస్టేట్ రంగంలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. కొంతకాలం కిందట బెంగళూరు నగరంలో హల్‌చల్ చేసిన 'డీకే ట్యాక్స్' ఇక్కడ కూడా వస్తుందేమోనని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

భేటీలు జరిగినా అనుమతులేవి?

సాధారణంగా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల్లో ఎంఎస్‌బీల అనుమతులకు సంబంధించి ప్రత్యేక ప్రక్రియ కొనసాగుతుంది. నిర్మాణదారులు దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత అధికారులు డాక్యుమెంట్లతోపాటు క్షేత్రస్థాయి పరిశీలనలు చేసి ఫైల్స్ సిద్ధం చేస్తారు. అనంతరం వారానికి ఒకసారి ఎంఎస్‌బీ అనుమతులపై కమిటీ భేటీ అవుతుంది. ఇందులో డైరెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉంటారు. వీటిని సమగ్రంగా పరిశీలించిన తర్వాత అన్ని రకాలుగా నిబంధనల ప్రకారం ఉన్న వాటిని ఆయా కమిషనర్లకు పంపుతారు. వారు అనుమతులిస్తేనే ప్రక్రియ పూర్తవుతుంది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు, నాలుగుసార్లు ఎంఎస్‌బీలపై కమిటీ సమావేశమైంది. అందులో ఫైళ్లను పరిశీలించి, కమిషనర్లకు కూడా పంపారు. అయితే వాటికి ఇప్పటివరకు అనుమతులు రాలేదు. గత రెండు నెలల నుంచి అసలు కమిటీ భేటీ కావడం లేదు. దీంతో మూడు నెలలుగా హైదరాబాద్‌లో ఎంఎస్‌బీలకు అనుమతులు లేకుండా పోవడంతో నిర్మాణరంగం ఒక్కసారిగా కుదేలయ్యే పరిస్థితి నెలకొన్నది.

వేసవిలోనే సాఫీగా పనులు

నిర్మాణ రంగానికి వేసవి కాలమే అనువైన సమయం. ఇది గడిస్తే వర్షాకాలంలో నిర్మాణ పనులు ముందుకు సాగవు. ముఖ్యంగా వానకాలంలో ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని బహుళ అంతస్థుల నిర్మాణాల్లో సెల్లార్ల పనులను చేపట్టకుండా అధికారులు కట్టడి చేస్తారు. అందుకే నిర్మాణదారులు వేసవిలోనే ప్రాజెక్టులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తారు. వేసవికి ముందుగానే అనుమతులు వస్తే వర్షాకాలం మొదలయ్యేలోపు కీలకమైన సివిల్ పనులను పూర్తిచేస్తారు. అయితే గత డిసెంబర్ నుంచి ఒక్క ఎంఎస్‌బీకి కూడా అనుమతి రాకపోవడంతో నిర్మాణసంస్థలు తలలు పట్టుకుంటున్నాయి.

ఏ ట్యాక్సులకో ఈ కాలయాపన?!

సాధారణంగా నిర్మాణ అనుమతులనేవి నిబంధనల ప్రకారం ఉంటే వస్తాయి. గత తొమ్మిదిన్నరేండ్లు కేసీఆర్ ప్రభుత్వంలో అదే జరిగింది. గత ఏడాది కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన కొత్తలో ఒక్కసారిగా బెంగళూరు నగరంలో ఎంఎస్‌బీ అనుమతులు నిలిచిపోవడం అక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపారులను కలవరపెట్టింది. అనంతరం పలు రకాలుగా అనధికారిక ట్యాక్సులు చెల్లిస్తేనే అనుమతులు వస్తున్నాయనే వార్తలు వెలువడ్డాయి. బెంగళూరులో 'డీకే ట్యాక్స్' కొనసాగుతున్నదనే ఆరోపణలొచ్చాయి. ఒక్కో చదరపు అడుగుకు రూ.500 వరకు ముడుపులు ముట్టజెప్పాల్సి వస్తున్నదనే విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంఎస్‌బీల అనుమతులు నిలిచిపోవడం బెంగళూరు తరహా ట్యాక్సులు రానున్నాయనడానికి సంకేతమని రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగాల్లో చర్చించుకుంటున్నారు. గత నెల, నెలన్నర రోజులుగా ఏ ఇద్దరు బిల్డర్లు కలిసినా ఇదే విషయం చర్చకు వస్తున్నదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. చదరపు అడుగుకు ఎంత నిర్ధారిస్తారు? అనధికారికంగా ఎంత చెల్లించాల్సి వస్తుందోనన్న ఆందోళన వారిలో కనిపిస్తున్నది.

'రాష్ట్ర సీడ్స్' ఎండీపై వేటు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చర్యలు

హైదరాబాద్, మార్చి 7(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ కేశవులుపై వేటు పడింది. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఆయనను ఎండీ బాధ్యతల నుంచి తప్పించి ఐఏఎస్ అధికారి హరితకు అదనపు బాధ్యతలను అప్పగించారు. వ్యవసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్లకు సంబంధించి గత పదేండ్ల పనితీరుపైనా మంత్రి విచారణకు ఆదేశించారు. గురువారం సచివాలయంలో కార్పొరేషన్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ల నిర్ణయాలు, విధానాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి 10 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావును మంత్రి తుమ్మల ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో ఐదు కార్పొరేషన్లకు వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించగా, మరో ఐదింటికి కోఆపరేషన్ డైరెక్టర్‌ను నియమించారు. రాష్ట్ర హార్టికల్చర్ అభివృద్ధి కార్పొరేషన్ సంస్థకు డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్‌ను, టెస్కాబ్‌కు దాని కార్యదర్శిని స్వయంగా విచారణ జరపాలని నిర్ణయించారు.మరోవైపురాష్ట్ర సీడ్ కార్పొరేషన్‌లో ఎలాంటి అవకతవకలు జరగలేదని, తనపై వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలేనని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు తెలిపారు.

వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పునరుద్ధరణ

నేడు ప్రారంభించనున్న కిషన్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా,ములుగు, మార్చి 7: కాకతీయుల కాలం నాటి వేయిస్తంభాల దేవాలయ కల్యాణ మండపాన్ని పునః ప్రారంభించేందుకు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర పురావస్తుశాఖ 2005లో పునర్నిర్మాణమనే మహాఘట్టానికి శ్రీకారం చుట్టింది. పునరుద్ధరణకు మొత్తం రూ.15 కోట్లు వెచ్చించి పనులు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. రాష్ట్ర మంత్రులు జూపల్లి , పొంగులేట్టి, కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించనున్నారు.

నేడు గిరిజన వర్సిటీ తాత్కాలిక క్యాంపస్ ప్రారంభం

ములుగులో ఏర్పాటు కానున్న గిరిజన యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌ను శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి ప్రారంభించనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో అధికారులు పూర్తి చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ భూములను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించగా ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో మేడారం సమ్మక్క సారలమ్మ పేరుతో వర్సిటీని నిర్మించనున్నట్టు స్పష్టం చేశారు. ములుగులో రూ.889.07 కోట్ల నిధులతో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు.

బెర్లిన్‌లో అంతర్జాతీయ పర్యాటక ట్రేడ్ ఫెయిర్

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : జర్మనీలోని బెర్లిన్‌లో అంతర్జాతీయ పర్యాటక ట్రేడ్ ఫెయిర్‌లో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా నిలిచింది. 109 దేశాల ప్రతినిధులు పాల్గొనగా, తెలంగాణ తరపున మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రమేశ్ చెన్నమనేని, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రధాన కార్యదర్శి శైలజారామయ్యర్, పర్యాటక శాఖ డైరెక్టర్ కే నిఖిల, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ జర్మనీ ప్రెసిడెంట్ డా.రఘు చలిగంటి, వైస్ ప్రెసిడెంట్ రమణ బోయినపల్లి, అడ్మిన్ మేఘనా సెగ్గు, సాంస్కృతిక విభాగం నుంచి నరేశ్ తౌతం, సోషల్ మీడియా విభాగం నుంచి యోగానంద్ నమేపల్లి తదితరులు పాల్గొన్నారు.

సీఐడీ కస్టడీకి ఇద్దరు ఏఎస్సైలు

నాంపల్లి కోర్టులు, మార్చి 7 (నమస్తే తెలంగాణ): నకిలీ పాస్‌పోర్టు కేసులో మీసేవ యజమాని కొప్పిశెట్టి కల్యాణ్, మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై తిప్పన్న, పంజాగుట్ట ట్రాఫిక్ ఏఎస్సై షేక్‌నజీర్ బాషాలను మూడు రోజుల సీఐడీ కస్టడీకి అప్పగిస్తూ 6వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు నిందితులను జైలు నుంచి సీఐడీ కార్యాలయానికి తరలిస్తారు. యూసుఫ్‌గూడలోని మీసేవ నిర్వాహకుడు కల్యాణ్, అబ్దుల్ సత్తార్‌తో కలిసి నకిలీ సర్టిఫికెట్లను రూపొందించి నకిలీ పాస్‌పోర్టులను తయారు చేశారు. దీనికోసం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేశారు. తిప్పన్న దరఖాస్తుల పరిశీలన సమయంలో శ్రీకృష్ణ కాంతయ్య, గుణశేఖర్ అనంతమూర్తి పేరిట శ్రీలంక జాతీయులకు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు తీసుకున్నారని పీపీ కోర్టుకు తెలిపారు. శశికల రమేశ్, తర్షిణీ శరవణన్‌ల దరఖార్తులకు హెడ్ కానిస్టేబుల్ షేక్ నజీర్ బాషా సైతం క్లియరెన్స్ సర్టిఫికెట్లను జారీచేసేందుకు రూ.5 వేలు తీసుకున్నారని రుజువైంది. మొత్తం 26 దరఖాస్తులకు పోలీస్ క్లియరెన్స్ జారీచేశారని విచారణలో తేలింది. 23వ నిందితుడిగా ఏఎస్సై వేంకటేశ్వర్లు కూడా అరెస్ట్ అయ్యారు.

కరెంటు వాడకంలో కొత్త రికార్డు

- **బుధవారం 298.19 మిలియన్ యూనిట్లు నమోదు**
- **జీహెచ్‌ఎంసీలో 10 మిలియన్ యూనిట్ల అధిక వినియోగం**

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం కొత్త రికార్డులు సృష్టిస్తున్నది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో మార్చి మొదటివారంలోనే రికార్డులు బద్దలవుతున్నాయి. బుధవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు వినియోగం 298.19 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. నిరుడు ఈ సమయానికి అత్యధిక విద్యుత్తు వినియోగం 297.89 మిలియన్ యూనిట్లు. ఈ ఏడాది ఆ రికార్డును అధిగమించినట్టు అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉన్నదని అధికారులు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీలో నిరుడు గరిష్ఠ విద్యుత్తు వినియోగం 59.53 మిలియన్ యూనిట్లు కాగా.. బుధవారం అత్యధికంగా 69.31 మిలియన్ యూనిట్లు నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ కూడా భారీగా పెరుగుతున్నది. నిరుడు మార్చి 6 నాటికి గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 14,856 మెగావాట్లు ఉండగా, ఈ ఏడాది మార్చి 1 నుంచే 15 వేల మెగావాట్లకుపైగా విద్యుత్తు డిమాండ్ నమోదవుతున్నదని అధికారులు వెల్లడించారు. బుధవారం ఈ సీజన్‌లోనే అత్యధికంగా 15,403 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ నమోదైందని తెలిపారు. ఇది గత ఏడాది కంటే 573 మెగావాట్లు అధికం. జీహెచ్‌ఎంసీలోనూ నిరుడు మార్చి 6 నాటికి అత్యధికంగా 2,910 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ నమోదుకాగా.. ఈ ఏడాది ఈ నెల 1 నుంచే 3,000 మెగావాట్లు దాటింది. బుధవారం ఈ సీజన్‌లోనే అత్యధికంగా 3,335 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ నమోదైంది. వ్యవసాయంతోపాటు అన్ని క్యాటగిరీల వినియోగదారులకు నిరంతర విద్యుత్తు సరఫరా అందుబాటులో ఉండటంతో వినియోగం భారీగా పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. విద్యుత్తు లభ్యత పుష్కలంగా ఉండటం, ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మరికొన్ని రోజుల్లో రోజువారీ వినియోగం 300 మిలియన్ యూనిట్లు దాటే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

సగటు విద్యుత్తు వినియోగం (మిలియన్ యూనిట్లలో..)

నెల	నిరుడు	ఈ ఏడాది
రాష్ట్రవ్యాప్తంగా		
జనవరి	227.42	243.12
ఫిబ్రవరి	263.48	272.86
మార్చి 6 వరకు	291.33	292.66
జీహెచ్‌ఎంసీ పరిధిలో..		
జనవరి	49.45	54.13
ఫిబ్రవరి	54.50	61.09
మార్చి 6 వరకు	57.4	66.13

అవార్డు గ్రహీతలతో ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఆర్టీసీలో మహిళా డ్రైవర్ల నియామకానికి కృషి

- **పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి పొన్నం**

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఆర్టీసీలో మహిళా డ్రైవర్లను నియమించుకునే అంశాన్ని పరిశీలించాలని సంస్థ ఎండీ సజ్జనార్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. హైదరాబాద్‌లోని టీఎస్‌ఆర్టీసీ కళాభవన్‌లో గురువారం గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌తోపాటు మేడారం జాతరలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఉద్యోగులకు, దసరా లక్కీడ్రా విజేతలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం మాట్లాడుతూ ఆర్టీసీలోని పెండింగ్ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. మహాలక్ష్మి పథకం కారణంగా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, దీనికనుగుణంగా కొత్త బస్సు లు కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. సంస్థ అభివృద్ధి కోసం సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని, వీరి కృషిని గుర్తించి అవార్డులు అందజేస్తున్నామని తెలిపారు. జాతీయస్థాయిలోనూ టీఎస్‌ఆర్టీసీకి అవార్డులు లభించాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనర్, సీవోవో డాక్టర్ రవీందర్, ఈడీ మునిశేఖర్, పురుషోత్తం, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీఎంఈ రఘునాథరావు పాల్గొన్నారు.

టీఎన్జీవోలో ఘనంగా మహిళా దినోత్సవం

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని హైదరాబాద్‌లోని టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. రాబోయే రోజులలో మహిళలు చట్ట సభల్లో ప్రత్యేక స్థానాన్ని పొందుతారని ఆశాభావం వ్యక్తంచేశారు. సమాజంలో, కుటుంబంలో మహిళల వల్లనే పురోగతి ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు వంటి కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

టీజీవో ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

హైదరాబాద్, మార్చి7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నాంపల్లిలోని కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ బీ శ్యామ్, కోశాధికారి ఎం ఉపేందర్‌రెడ్డి, టీజీవో మహిళా ప్రతినిధి దీపారెడ్డి, వివిధ డిపార్ట్‌మెంట్ల మహిళా గెజిటెడ్ అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించాలి

- **పంట పొలాలకు నీరందించాలి**
- **వాడివేడిగా జడ్పీ సర్వసభ్యసమావేశం**
- **బీఆర్‌ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీల వాకౌట్**

కరీంనగర్ జడ్పీ కార్యాలయంలో పోడియం ఎదుట బైఠాయించిన జడ్పీటీసీలు, ఎంపీపీలు

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 7: తెలంగాణకు జీవధార అయిన మేడిగడ్డ బరాజ్‌ను వెంటనే పునరుద్ధరించి, సాగుకు నీరందించాలని బీఆర్‌ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన జడ్పీ సర్వ సభ్య సమావేశంలో గళమెత్తారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా రైతుల సమస్యలు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం చూపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి నెలకు ముందే కరీంనగర్ జిల్లాలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సరికాదని అన్నారు. కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్‌పై ఉన్న కోపాన్ని రైతులకు రుద్దుతున్నదని, ఫలితంగా చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని ధ్వజమెత్తారు. మేడిగడ్డ బరాజ్ మరమ్మతులపై దృష్టి పెట్టకపోవడంతోనే సాగునీటికి తిప్పలు వచ్చాయని ఆరోపించగా, కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ జోక్యం చేసుకొని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన జడ్పీటీసీల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పలువురు బీఆర్‌ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు పోడియం ఎదుట బైఠాయించారు. ప్రజా సంక్షేమం వీడి స్వలాభం కోసం పార్టీలు మారుతున్న నాయకులు తమను విమర్శించడం సరికాదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ, సమావేశం నుంచి వాకౌట్ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ కనమల్ల విజయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఈవో శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేడిగడ్డను పరిశీలించిన ఎన్డీఎస్‌ఏ బృందం

మహదేవపూర్, మార్చి 7: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌ను కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల బృందం గురువారం పరిశీలించింది. ఉదయం 8 గంటలకు మేడిగడ్డలోని ఎల్‌అండ్‌టీ సంస్థ క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి బరాజ్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. 9.30 గంటలకు మేడిగడ్డ బరాజ్ వద్దకు చేరుకొని కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. బరాజ్ డిజైన్, నిర్మాణం, లోపాలపై అధ్యయనం చేశారు. అక్కడి నుంచి మహారాష్ట్ర వైపు ఉన్న బరాజ్ ఏడో బ్లాక్‌లో కుంగిన 19, 20, 21వ పియర్ల దిగువ భాగాన్ని పరిశీలించారు. కుంగిన పియర్ల వద్ద ఉన్న గేట్ల పరిస్థితిని పరిశీలించారు. బరాజ్‌లో సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన పునరుద్ధరణ పనులపై చర్చించారు. బృం దంలో చంద్రశేఖర్ అయ్యర్‌తోపాటు సెంట్రల్ వాటర్, పవర్ రిసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ ఆర్ పాటిల్, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ యూసీ విద్యార్థి, సీడబ్ల్యూసీ బీసీడీ డైరెక్టర్ శివకుమార్, గేట్స్, సీడబ్ల్యూసీ, డిజాస్టర్ అండ్ రిసిలెయెన్స్ డైరెక్టర్ రాహుల్ కుమార్ ఉన్నారు.

ఎస్సై అంతిరెడ్డి కొట్టడంతో పాదాలు కమిలాయని చూపుతున్న బాధితుడు రమేశ్

బీఆర్‌ఎస్ కార్యకర్తపై పోలీసుల దాష్టీకం

- **వాట్సాప్ స్టేటస్ విషయంలో పిలిచి కొట్టిన ఎస్సై**

నార్కట్‌పల్లి మార్చి 7: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడేనికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మాదగోని రమేశ్ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. వాట్సాప్ స్టేటస్ విషయమై ఎస్సై అంతిరెడ్డి తనను స్టేషన్‌కు పిలిచి కొట్టినట్టు బాధితుడు రమేశ్ ఆరోపించాడు. ఎస్సై అంతిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు గురువారం ఎస్పీ చందనా దీప్తి, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. 'నా వాట్సాప్ స్టేటస్‌లో ఇటీవల బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ చేసిన ప్రసంగాన్ని పెట్టుకున్నా. ఈ విషయమై ఎస్సై బుధవారం నన్ను స్టేషన్‌కు పిలిపించగా నా స్నేహితుడు నవీన్‌తో కలిసి వెళ్లాను. స్టేషన్‌లో నన్ను చూడగానే ఎస్సై బూతులు తిడుతూ బెల్ట్‌తో కాళ్లు, చేతుల మీద విపరీతంగా కొట్టారు' అని బాధితుడు వాపోయాడు. రమేశ్ స్నేహితుడు నవీన్ ఈ ఘటనను ట్విటర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాడు. కేటీఆర్ వెంటనే ఎస్పీ చందనాదీప్తికి ఫోన్ చేసి.. ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ చందనాదీప్తి స్పందిస్తూ విచారణకు ఆదేశించినట్టు తెలిపారు.